# కుయ్యో మొర్రో శతకం

(ఛందో బంధ రహితం)




డాక్టర్ లంకా శివరామప్రసాద్



ఎన్నికలు-2014

# కుయ్యో మొర్రో శతకం

✧✧— (ఛందో బంధ రహితం) —✧✧

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# కుయ్యో, మొర్రో శతకం

(ఛందో బంధ రహితం)

by

**Dr. Lanka Siva Rama Prasad**

April 2014

All rights reserved

Copyright @ 2014

by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Price : ₹ **50** **$ 4**

Cover Design : Adopted from **Craig Frazier**

Post Script : **Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal.
Ph : 0870-2426364

***This book is presented to...***

# ప్రస్తావన

కంద పద్యాల్లాంటివో వంద
అందముగా రాద్దామని అనుకోగానే ముందర
గందరగోళపు ఎన్నికల
చిందర వందర దృశ్యాల చిందులాడె మది, కుయ్యోమొర్రో

యతి ప్రాసలున్నాయాయని
వెతికిన వారి మతికి తోచకముందరే, నే
నతి జాగ్రత్తతో పలికితి
గతి తప్పిన ప్రగతి దారి నియతికి దూరమని, కుయ్యోమొర్రో

వందనాలు మిత్ర బృందానికి
కందకులేని దురద కత్తిపీట కెందుకని
అందరి ఆలోచనామక
రంద మరంద వాహినులిందు జేర్చితి కుయ్యోమొర్రో

విందు భోజన మందున
మందుంటే బహుపసందని అందరంటున్నా
సుందోపసుందుల నడుమన
సుందరి కవితనుంచి నే సందడి చూస్తున్నా కుయ్యోమొర్రో

కలమున్న వాడికి బలము
కలకలము కలిగించు ఎన్నికల కాలములో నుండున్
కలలే లోకమైన కవికి
కలవరమై కలిగించు కళలే సాకారమగును కుయ్యోమొర్రో

# కుయ్యో మొర్రో శతకం

1. అయ్యో! వీడా నా కొడుకటంచు
రయ్యన మంచి గాడిదొకటి రగిలిన భంగిన్
తియ్యని మాటలు పలికెడి ఈ
దయ్యపు నాయకుల నమ్మకుమయ్యో కుయ్యోమొర్రో!

2. నీళ్లుండవు బావిలో, వరి
చాళ్లుండవు పొలాల పైర్లుండవు సరిగా కరెంటుండదు
ఇళ్లుండవు తలదాచుకొనన్, క
న్నీళుండవు ఎండి వడలిన మోములందు కుయ్యోమొర్రో!

3. కుక్కలకుండును విశ్వాసము
నక్కలకుండును సామూహిక సహజీవనము
చుక్కలకుండును చక్కని కాంతి, కానీ,
టక్కరి నాయకులకుండును ఒళ్లంత విషము కుయ్యోమొర్రో!

4. ఓటేయుట నీ మనో మర్మము
వాటేయుట వాడికి తత్కాల వచోధర్మము
కాటేయుట సర్ప సహజము
మాటేసి దోచేయుట మన వాడి నైజము కుయ్యోమొర్రో!

5. మూడు రంగుల మూడు చెదరెను
గూడు తెచ్చిన గులాబిలో గుట్టు తెలిసెను
తూడు తెగిన కమలము పసుపు
తాడు కట్టి మోడీ జపము చేయును కుయ్యోమొర్రో!

6. ఎన్నికల పండగొచ్చెనని
ఎన్నికలలు కన్నావురా ఎర్రిమాలోకమా!
ఎన్నిక చేయకముందే నిన్ను
ఎన్నిక చేసినాడు మందూ, డబ్బుతో వాడు కుయ్యోమొర్రో!

7. గ్రహణము పట్టెనొక చంద్రుడికి
గ్రహణము వీడెనొక చంద్రశేఖరుడికి, కుల
గ్రహణము వీడదయ్యె ఇద్దరినీ
గ్రహణము విడదీసిన వీరు చెరొక దరిన కుయ్యోమొర్రో!

8. చీకటి సమాజపు దారులలో
లోకపు సత్తా అంతా కూకటిపల్లికేనా అని
లోకులు కోడైకూస్తుంటే, రే
చీకటిలో మల్కాజగిరి జయప్రకాశమట, కుయ్యోమొర్రో!

9. నారాయణ! నీ నామారుణ
పారాయణ మీనాడు ఖమ్మము జేరెను, సరే కానీ
నారావారి కమ్మని గాలి వీచు
మీరాచోటున నిలబడు విచిత్ర ఖర్మమెట్లున్నదో, కుయ్యోమొర్రో!

10. సైకిలు తొక్కుట కన్నను వె
హికిలు కారెక్కుట బహు తెలివనుకున్న ఔత్సా
హికులు గులాబీ లాబీయింగుల
మైకులు పట్టుకుని మరీ వదరుతున్నారు, కుయ్యోమొర్రో!

11. రాఘవ నీ రాగములన్నీ
లాఘవముగ పలుకు లఘుగీతములాయెన్, అ
మోఘమగు నీ వాక్ సూర్యుని
మేఘములావరించ ఎరుపు మెరుపులేవీ, కుయ్యోమొర్రో!

12. మంద గమనమున తన జన
మంద వెంటరాగా కృష్ణుడు ఎన్నికల వేడి
విందారగించ మహాజన
బృందావనీ సమీప జలరహిత సరస్సుజేరె, కుయ్యోమొర్రో!

13. అర్ధము అతి ప్రధానమని
అర్ధము చేసుకున్నవారదృష్టవంతులయ్యా, గూ
డార్ధము కూడబెట్టి ఎన్నికల క్రీ
డార్ధము పెట్టుబడి బెట్టి వడ్డీతో వసూలు చేయుదురు, కుయ్యోమొర్రో!

14. వడ్లెన్ని రకాలో రెడ్లన్ని విధాలని
గుడ్లెన్ని విధాలో సారాబుడ్లన్ని స్వరూపాలని, కను
గుడ్ల సాక్షిగా వచింతురు విజ్ఞుల్
రెడ్లన్నది జెండా రంగు; కులగజ్జి కాదు, కుయ్యోమొర్రో!

15. కోటికి నూటికి ఒకడే ఆనాడు
కోటికి పడగలెత్తి గౌరవమందిరి, కానీ నాడు
కోటీశ్వరులెందరో ఒక తటిన
కూటికి, కాటికి నోచని జనమెందరో ఈతటిన, కుయ్యోమొర్రో!

16. భారం బావ అరవిందునుంచు
చిరంజీవ చిరంజీవ సుఖీభవ సుఖీభవ
గరం గరం గబ్బరుసింగు, కోప సా
గరం పవనలోకకళ్యాణ మునకట, కుయ్యోమొర్రో!

17. జయప్రదలు, జయసుధలూ
జయప్రదముగ నటించిరి చట్ట సభలలో, కాని వి
జయశాంతి కామన విఫలం కాగా
జయహో సోనియా! అన్నా దొరకలే సి.యం. పదవి కుయ్యోమొర్రో!

18. రెంటికీ చెడిన రేవడ వోలె
పంటికీ వంటికీ గాయాలై పండి, మండిన కొందరు
కంటికీ మింటికీ కన్నీరు కార
ఇంటింటికి తిరిగి ఏడ్చుచున్నారు ఇక స్వతంత్రంగా, కుయ్యోమొర్రో!

19. బెడిసి కొట్టిన పథకాల
తడిచి ముద్దైన సంచి తగిలించుకుని, రాని అశో
కుడికై ఎదురు తెన్నులు చూ
సెడి కిరణకుమారుడి నష్ట ప్రాభవమ్మది కుయ్యోమొర్రో!

20. రెండు నెలలైనా, రెండ్రోజులైనా
నిండుగ అధికారం వస్తే నాగుండె బలం చూపించనా!
దండుగ మారి రాజకీయుల కన్నా
మెండుగ పాలించెదననియె మన నరసింహుడు కుయ్యోమొర్రో!

21. కోడిష్టం ఒకడికి, ఇంకొకడికి ప
కోడి; ఎవడిష్టం వాడిది, కష్టంలానే, ప
క్కోడి కష్టమే పట్టని వాడు, బ
క్కోడిని, వాడిని, వీడిని కొరుక్కుతినును కుయ్యోమొర్రో!

22. రహదారి గుంతలు సహజమని
మహదానందమున పలుకుదురా మహా గుత్తేదార్లు,
మహమ్మారి లంచ దేవతకు
అహరహము మామూళ్లిచ్చి పోషించెదరు కుయ్యోమొర్రో!

23. మామూలు వానకు తెగును, షరా
మామూలే అని చేయుదురు మరమ్మత్తులు గమ్మత్తులు
మామూలై మరల తెగును గట్లు
మామూళ్లే వరద కాగా మామూలు వాళ్లేడ్చెదరు కుయ్యోమొర్రో!

24. టీ.వీ. అను మత్తుపెట్టె మెల్లగా
తీవిగా అరుదెంచిన తొలి క్షణాన్నుంచి, ప్రతి
జీవీ మా ఇంట దాసుడాయె దానికి
ఏవీ ఆ పాతరోజులు? మాటలు కరువాయెనయ్యో, కుయ్యోమొర్రో!

25. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు
పులిమీద పుట్రలా సెల్ఫోన్లూ, ఐపాడ్, టాబ్లెట్లు
పులీ-మేకా ఆట ఉద్యోగం ఇక్కట్లు
పులిదే ఎప్పుడూ పైచేయి, ఇక బతికేదెట్లు? కుయ్యోమొర్రో!

26. జగనే మాయగా జగమెరిగి
తగవులు పెట్టి తీర్చెడి మగమహరాజుననుకున్నాడతడు
తగని ధైర్యంతో దళపతియై, ఎడ
తెగని అధికారాన్ని, 'నీకింత నాకింత' గా మార్చినాడు కుయ్యోమొర్రో!

27. మేము సీఎం అయితే తప్పేంటిట
తాము దక్కిన కాడికి భోంచేస్తే తప్పని మేమన్నామా
వాములు మింగిన వాడికి ఫలహా
రము కాదా పచ్చగడ్డి, మాకొచ్చింది ఛాన్సిప్పుడు, కుయ్యోమొర్రో!

28. టైటానియం కుంభకోణమట
టైటానిక్ ఓడలా తామునుగునో, ముంచునో, మాయా
'వై'టానిక్ గజిబిజి కంపెనీల
ఫైటాటలలో డబ్బంతా జగన్మోహనమేనట కుయ్యోమొర్రో!

29. కొన్ని పాదయాత్రలు మరి
కొన్ని బాధయాత్రలు, అన్ని యాతన యాత్రలూ చేరు
కున్న హైదరాబాదు యాత్రల్లో
అన్ని పదవీ పదజాతరలే, ప్రజలకేమొరుగు, కుయ్యోమొర్రో!

30. మన పనికి రానివాడు
మనకు పనికి రానివాడై మసలును కదా
తన పనినే చేయనివాడు
తన పనితనము తగ్గి తగు సేవకుడగు కుయ్యోమొర్రో!

31. వందల వేల పడక లాస్పత్రు
లందముగా పడగల బోర్డులెత్తి బుసకొట్టున్
ఇందరు రోగులెందుకయ్యారని
మందు డెవడన్నా అడగడందుకనే, కుయ్యోమొర్రో!

32. వైద్యోనారాయణో హరి,
విద్యోమిధ్యా సరస్వతీ బ్రహ్మ స్వరూపం
సద్యో శక్తి శవానందలహరి
మద్యో జల ప్రవాహ మహాజనప్రభావమహ, కుయ్యోమొర్రో!

33. హరియించిరి విద్యా వైద్య, ల
హరీ సంపదలను ప్రై వేటు పారిశ్రామికు లెంచక్కా మరి
కరి కాలు మకరి పట్టగ, శ్రీ
హరి రావాలన్నా ఫీజివ్వాలి కదా, కుయ్యోమొర్రో!

34. దేవోభవ ప్రతివాడికి
దేవోభవ మాతృ, పితృ, ఆచార్య స్లోగను కాగా
దేవుడు కూడా శిలగా మారి
దేవాలయ గర్భగుడిలో దాగున్నాడట, కుయ్యోమొర్రో!

35. ఇంప్యూర్ గాలి ఇంటా బయటా
కంప్యూటర్, సెల్ఫోనులు కవచకుండలాలట
ఇంప్యూర్ నీలి చిత్రానంద నెట్టింట
కంప్యూటర్, గూగుల్, ఫేస్బుక్కు, ట్విట్టర్ స్థలనాలు, కుయ్యోమొర్రో!

36. రొయ్యకు బారెడు మీసం మా
అయ్య పొలం కాస్తా చేపల చెరువైన చోద్యం
రొయ్యలు డాలర్లై మళ్లీ మాయ
మయ్యాక ఉప్పునీటి కయ్యలే మిగిలెను, కుయ్యోమొర్రో!

37. కొల్లేరను మంచినీటి చెరువు
పల్లేరు నల్లేరు లాంటి పిచ్చిమొక్కల పరమై నశియించె
ఇల్లే ఇదని వచ్చు వలస పక్షు
లిల్లే కరవై, కొల్లలుగా మృత్యులోగిలోకెళ్లెను కుయ్యోమొర్రో!

38. మానిఫెస్టోలేనా అన్నీ, వు
మాని ఫెస్టోలేవని, ఫెమినిస్టులు గరమైనా
రని ఫెస్టివల్సు జరుపుకున్నారట
కనీవినని రీతిలో యం.సి.పీ.లు. కుయ్యోమొర్రో!

39. అత్యుత్తమ భారత్ నేనిస్తా
నత్యున్నత దేశంగా వెలిగిస్తానని నేతలంటుంటే
ప్రత్యుత్పత్తిలో పైచేయి కదా
అత్యూహలేమోనని దడపుట్టెనాకు, కుయ్యోమొర్రో!

40. చైనా వెళ్లి ఏంచైనా అన్నా మం
చైనా వాళ్ల పట్టుదలలో పట్టు గ్రహించి తలవం
చైనా మన తలసరి ఆదాయం పెం
చైనా సరే పేదల రక్షింపరే వీళ్లు, కుయ్యోమొర్రో!

41. రాహు కాలంలో రాగలడా
రాహుల్ అని కాంగిరేసులో ఊహలెక్కువై,
కుహు కుహుమని కూస్తున్న
బహు మేధావి మోడీ భజన చేస్తున్నారట, కుయ్యో్యమొర్రో!

42. ఢిల్లీ మామిడి చిగుళ్లు తిని
గల్లీల్లో కూసిన కేజ్రీ కోయిల పదవీ పుష్ప
వల్లీలో ఇమడలేనని
తల్లీ, చెల్లీ అంటూ మళ్లీ ఎలక్షన్లలో దూకె, కుయ్యో్యమొర్రో!

43. ఎలక్షన్లంటే ఏమనుకున్నావు
కలక్షన్ల సీజను గదా అందుకే సరైన పార్టీని
సెలక్షను చేసుకో, లేకుంటే
సలక్షణ జీవితం కాస్తా సలసల కాగుతుంది, కుయ్యో్యమొర్రో!

44. ఇష్టులెవరు నీకు, కమ్యూ
నిష్టులా, కాంగ్రేసు నిష్టాగరిష్ఠులా, సోష
లిష్టులా, కమల దళ ప్ర
విష్టులా, ఏలిష్టుపై నీ టేస్టున్నది, కుయ్యో్యమొర్రో!

45. మోడీ గానము విని త
మ్మోడి న పద్మసంభవ తమ్ముల నందరి
నడిగెనట అన్న అద్వానీ- 'న
న్నోడి తన్నోడెనా, తన్నోడి నన్నోడెనా' అని, కుయ్యో్యమొర్రో!

46. నవ హుషార కిషనుడు
నవ యౌవనోత్సాహ కుషను పై నున్నవాడు, తన
నవ మిషనును ఏమిషతో
నవ తలబెట్టి కమలమునకు పచ్చరంగేయు, కుయ్యోమొర్రో!

47. సిట్టింగ్సుకు సింహభాగమా
ఫిట్టింగులు మాకు గిట్టవని రెబెల్స్ కొందరు
కట్టింగులు పార్టీకి చేస్తే
సెట్టింగులు మార్చె చంద్రశేఖరుడట కుయ్యోమొర్రో!

48. సిపి యమ్ముల పొది ఖాళీ
జేపి తమ్ముల సత్తా జగమున కెరుకే, వై
సిపి దిగ్గజ ఖంగాళీ కాగా
రేపిక తోడెవ్వరు మాజీ రేడు కిరణుకు, కుయ్యోమొర్రో!

49. అన్నొక పార్టీ, తను కన్న
సన్నొక పార్టీ, మన్నూమిన్నూ ఏకం చేసి తాను
మొన్నొక పార్టీ, తన భార్య
నిన్నొక పార్టీ, అన్ని జెండాలా ఇంటిపైనేనట కుయ్యోమొర్రో!

50. అత్తారింటికి దారేదీ అని
పత్తా లేకుండనే పోతివా పవన కళ్యాణా!
కొత్తావకాయ బాగే కానీ
విత్తాలంటే కొత్త మొక్క, నీరూ నేలా వద్దా కుయ్యోమొర్రో!

51. అన్నా అని రాఖీ కడితే
అన్యాయం జరిగిందని విజయ శాంతి మొత్తు
కున్నా విన్నోళ్ళు కన్నోళ్ళు లేక
నిన్నా మొన్నా తా దిట్టిన కాంగిరేసులోనే దూకె కుయ్యోమొర్రో!

52. కొంగలు జపము చేయుట
దొంగలు రాత్రింబవళ్లు శ్రమము చేయుట, ముని
పుంగవులు తపము చేయుట
అంగన లలంకరణ, ఆహారార్థ మోక్ష కామనలే కుయ్యోమొర్రో!

53. ఆకాశంలో సగం ఆమెదని
కాకాపట్టి బాకాలూదిన రాజకీయ పక్షాలన్నీ
మోకాలడ్డిరి టికెట్లిచ్చేప్పుడు,
సాకార మెట్లగును మహిళా సాధికారత, కుయ్యోమొర్రో!

54. మనుషులు తీసిన గోతుల్లో
మనుషులు పడుటే న్యాయము, గ్రానైట్, బాక్సైట్
గనులు తవ్వి కోట్లు దోచిన
ఘనులకా గోతుల్లోనే గోరీ కట్టరాయె, కుయ్యోమొర్రో!

55. అంగట్లో అన్నీ ఉన్నాయి, మా
సంగట్లో నెయ్యిలేదు, చికెను కూరా లేదని
గొంగట్లో తిని గొణుగుతూ
ముంగిట్లో కొచ్చి ఓటు ముష్టడుగుతున్నారు కుయ్యోమొర్రో!

56. ‘లా’ వొక్కిం తయు లే దార్డరా
తావులు దప్పెను సమసమాజపు లైట్లనుకున్న వారి
చావులతో కంచే చేనుమేయ
ఠావులు దప్పి బక్కజన జీవుల ఘోష నింగికెక్కె కుయ్యోమొర్రో!

57. రెక్కాడితే డొక్కాడుననే
బక్క జీవుల నెక్కిరించు ఇబ్బందుల బందులాపి
చక్కగ పాలన చేయని
నక్కల కుక్కల నడ్డంగా నరకవలె కుయ్యోమొర్రో!

58. గన్నున్నోడిదే రాజ్యమా, మా
గన్నుగ ఎన్నడు నిద్రపోవాలె మామూలు జనమా, ఆ
కన్నుల కలికము పోసి
తన్నులపై తన్నులతో పన్ను లేస్తున్నారు కుయ్యోమొర్రో!

59. పదిహేడు మంది మద్రాసు
లొ దివ్యసమాజ థియొసొఫికల్ మీటింగున ప్రతి
పాదన చేయగా ఎ.ఒ. హ్యూము
వాదన బలమై ఏర్పడెనట కాంగిరేసు ఆలోచన కుయ్యోమొర్రో!

60. బొంబేలో తొలి మీటింగు, డి
సెంబరు నెలాఖరున పద్దెనిమిది వందల ఎనభై అయిదులో-
మెంబర్లు డెబ్భై రెండుమంది
సంబరముగా ఎన్నుకొనిరి బెనర్జీ నధ్యక్షుడిగా కుయ్యోమొర్రో!

61. పంతొమ్మిది వందల ఏడులో
పంతములెక్కువై ఉగ్ర తిలక్ ఒకదారిన
శాంత గోఖలే మరొక దారి,
కొంత గరమ్, కొంత నరమ్ దళములైనారట కుయ్యోమొర్రో

62. దాదాబాయి నౌరోజీ, మహ
మ్మదాలీ జిన్నా, బాలగంగాధర్ తిలక్, బిపిన్
చందర పాలు, లాలా లజపతిరాయి
త్యాదులు పరిపుష్టిగావించిరట కాంగిరేసును కుయ్యోమొర్రో!

63. వంగదేశపు విభజన
పొంగించిన స్వదేశీ ఉద్యమ మహోధృతికి
సంగర సన్నాహాలు మొదలై
కాంగిరేసులో చేరెను గాంధీ, గోఖలే తోడ్పాటుతో, కుయ్యోమొర్రో!

64. ఖిలాఫత్ ఉద్యమ కలయిక
లిలావద్దని విడిపోయిరి కాంగిరేసు నుంచీ, మోతీ
లాలునెహ్రూ, చిత్తరంజన్, అనీబిసెం
టులు స్థాపించిరి స్వరాజ్య పార్టీనట, కుయ్యోమొర్రో!

65. సత్యాగ్రహమే ఆయుధమై
నిత్యాగ్ని జ్వాలగా నియమ పాలన చేయుచున్
ప్రత్యక్షముగా ప్రతి మాటను
ప్రత్యక్షరము ఆచరించి ప్రసిద్ధుడయ్యె గాంధీ కుయ్యోమొర్రో!

66. పటేలు, నెహ్రూ, ప్రసాదులు
మేటి నాయకులు, కృపలాని, అబ్బాస్, గఫార్‌ఖానులు
తోటి మిత్రులు సిన్హా, ఆజాద్‌లతో
నాటి జయప్రకాశనారాయణ, గాంధీకి తోడైరి, కుయ్యోమొర్రో!

67. పూర్ణ స్వరాజ్య దివసముగ
వర్ణన చేసిరారోజు ఇరవై ఆరు జనవరి, మ
హార్ణవమై ఉప్పొంగె, జను లా
కర్ణించిరి, పంథొమ్మిదివందల ముప్ఫైలో, కుయ్యోమొర్రో!

68. బోసు వీడెను కాంగ్రేసును
దూసుకు వచ్చె తొలి ప్రపంచ యుద్ధ భీభత్సము
మూసుకుపోయె శాంతి దారి
కోసుకుపోయిరి ప్రజల కోర్కెలను బ్రిటిషువాళ్లు కుయ్యోమొర్రో!

69. స్వరాజ్యం వచ్చిన సంతోషం
ద్విరాజ్యాలైన భరతఖండపు దుష్టఘడియల్లో
హరాయించుకుపోయెనయ్యో
దురాగ్రహాలు పెచ్చై దునుమాడిరి ఒకరినొకరు కుయ్యోమొర్రో!

70. విభజించి పాలించి శ్వేత
ప్రభువులు ప్రజ్వలించిరి ప్రజాగ్నిపై నెయ్యిపోసి,
ప్రభవించె మత శక్తులు
సభలో కబళించె జాతిపితను కుయ్యోమొర్రో!

71. ‘హేరాం’ అని కన్ను మూసెనా
కారణజన్ముడు, అంధకారాన మునిగె భరతభూమి,
ఐరన్‌మాన్, ఉక్కుమనిషి ఆ
సరదార్ పటేల్ అస్తమించెనా పిమ్మట కుయ్యోమొర్రో!

72. లౌకిక వాదము, పారిశ్రా
మికీకరణము, అలీన సిద్ధాంతాలశ్వమ్ములుగా
వేకువ వాకిట వేచియున్న
ఆకటి దేశరథాన్ని అభివృద్ధి దిశ నడిపె, నెహ్రూ, కుయ్యోమొర్రో!

73. చైనా యుద్ధం కలిగించిన
మనోవ్యధతో కన్నుమూసే నా మహాయోధుడు
ఆనక వచ్చిన శాస్త్రీజీ
అనెను కదా జై జవాన్, జై కిసానని, కుయ్యోమొర్రో!

74. కింగు మేకరు కామరాజు
కాంగిరేసుకు రింగులీడరై రాజ్యము నడిపెన్
పంగ నామం గురువుకు పెట్టి
అంగన ఇందిర ఇండికేటుగా ఇంటగెలిచె కుయ్యోమొర్రో!

75. కాడి జోడెద్దులు, కామరాజు
నడిపిన సిండికేటుకు రాగా, ఇందిరకు ఆవూ
దూడ ఎలక్షను సింబలాయె, ప్రజా
నాడి పట్టిన ఇందిరకు పట్టముగట్టిరట, కుయ్యోమొర్రో!

76. గరీబి హఠావో నినాదం
మురిపించె ప్రజలను; బంగ్లా యుద్ధ విజయాన
పెరిగె గర్వము; వేదము
మరి తన మాటగా అధినేత్రి ప్రకటించె ఎమర్జెన్సీ, కుయ్యోమొర్రో!

77. రెండేళ్ల ఎమర్జెన్సీ పాపం
పండెనన్నట్లు ఓటమిపాలై వెళ్లెను జైలుకామె,
రెండేళ్లైనా పదవిలో కూ
ర్చుండలేని జనతాపార్టీ కిచిడీగా కూలె, కుయ్యోమొర్రో!

78. చీలిక మరిన్ని చీలికలై
ఏలిక ఉన్నవేపే కాంగిరేసు నది పారెన్
ఎలక్షను సింబలు కూడా
సలక్షణ హస్తమై, ఆవుదూడ అదృశ్యమాయె కుయ్యోమొర్రో!

79. కాడి జోడెద్దులను విడ
నాడి ఆవుదూడతో తానాడె ఇందిర కాంగ్రేసు
నాడి ప్రజలది పట్టు కొ
నెడి ఛాన్సు 'హస్తం' గుర్తుతో వచ్చెననిరి, కుయ్యోమొర్రో!

80. నింగి ప్రమాదాన సంజయ్,
సింగుల కోపాగ్నికి ఇందిర, తమిళపులులపై
రింగుకు రాజీవుగాంధీ వా
ర్నింగులేని వార్‌లందు కూలిరి దారుణంగా, కుయ్యోమొర్రో!

81. పదముగ్గురు ప్రధానమంత్రి
పదవిలో నుండిరి- నెహ్రూ, శాస్త్రి, నందాకు ఆ
పదవి ఆపద్ధర్మము కాగా
పదకొండు మంది ప్రధానమంత్రులైరా తరువాత కుయ్యోమొర్రో!

82. ఇందిర, మొరార్జీ, చరణ్సింగు
ఇందిర మరోసారి, రాజీవుగాంధి, వి.పి.సింగు
చందరశేఖరు, నరసింహారావు,
అందరికన్నా తక్కువ పదమూడురోజులే వాజపాయి, కుయ్యోమొర్రో!

83. దేవెగౌడ, గుజ్రాలు, మరల
దైవ నిర్ణయాన వాజపాయి; ఆతని వెనుక ప
దవి దక్కిన మన్మోహనుడు, పె
దవి విప్పని ఘనుడుగా పేర్గాంచెనతడు కుయ్యోమొర్రో!

84. రానున్నది రామరాజ్యమా
కానున్నది రాహుల్ కాలమని కాంగ్రేసువాదులు;
రానున్నది రామరాజ్యమే
తేనున్నది మోడీ ప్రగతి దేశమని ప్రతివాదులనిరి, కుయ్యోమొర్రో!

85. స్కాములు, గొలుసుకట్టు బహు
స్కీములు, అరచేతిలో స్వర్గాన్ని చూపించు దొంగ
స్వాములు, కబ్జాలతో ధన
స్వాములు భూస్వాములు కసాయి వాళ్లైనారు కుయ్యోమొర్రో!

86. ‘ఎక్కువ పనిచేసి మాట్లాడు
తక్కువ’ని నినదించెను ఇందిర అరవై ఆరులో-
చక్కగ ‘సాగనంపుడిందిరను’
మిక్కిలిగా ‘రక్షింపుడు దేశాన్నని’ జెపి, డెబ్భైఏడులో కుయ్యోమొర్రో!

87. ‘ఒక సివంగి, కోతులు వంద
చికమగలూరు, చికమగలూరు’ అను దేవరాజు అర్స్
కేక డెబ్భై ఎనిమిదిలో కలిసి
రాక పరాజయం పాలాయె ఇందిర కుయ్యోమొర్రో!

88. ‘దళిత ముస్లిం భాయీ భాయ’ని ము
కుళిత హస్తాల పలికిరి మండల కమిషనప్పుడు
కాళీయ మర్దను నారాధించు
కేళీవ్రతులైన హిందూ తత్త్వవాదులానాడు కుయ్యోమొర్రో!

89. ‘గరీబీ హఠావో’ అనిందిర
‘బారీబారీ సబ్‌కా బారి, అబ్‌కా బారి, అటల్ బి
హారీ’ - అని బిజెపి, ‘జాట్
పర న పాట్ పర్, మొహర్ లగేగీ హాథ్ పర్’ అనె పి.వి. కుయ్యోమొర్రో!

90. ‘ఇండియా షైనింగ’ను ఘోష
వెండికొండలను తగిలి మెండుగ మెరసెన్
దండిగ కరసేవకులెల్ల
దండెత్తగ కూలిన ‘బాబ్రీ’, దేశమునకు గండిపెట్టె కుయ్యోమొర్రో!

91. అర్ధరాత్రి స్వతంత్రమొచ్చి
వ్యర్ధముగా అరువది ఏడేళ్లు అనర్ధముల పాలాయె
స్వార్ధము మిక్కుటమై అర్ధప
దార్ధ జీవనశైలి పరార్థము తొలగదోసె కుయ్యోమొర్రో!

92. ఎక్కడ గాంధీ, నెహ్రూ, తిలక్
లెక్కడ అంబేద్కర్, లోహియా, పటేల్, బోస్
లెక్కడ వాజపాయి, పీలుమోడీ
ఎక్కడ జగజ్జీవనరామ్, రాజేంద్రప్రసాదులు, కుయ్యోమొర్రో!

93. ఏరీ సర్వేపల్లి, జకీర్
లేరీ వి.వి.గిరి, ఫక్రుద్దీన్, నీలం సంజీవరెడ్డి
ఏరీ జైల్‌సింగ్, శర్మాదు
లేరీ వెంకటరామన్, నారాయణన్, కలాములు కుయ్యోమొర్రో!

94. ప్రజలకై ప్రాణాలనిచ్చి
విజయపథాన దేశాన్నినడిపిన వీరులేమైనారో
నిజమైన దేశభక్తితో
ఇజాలను పక్కనెట్టి నిజ సత్యము వెదకవలె కుయ్యోమొర్రో!

95. గాంధీలెందరున్నా మహాత్మా
గాంధీ ఒక్కడే మహనీయ గుణాన్వితుడు, గా
ఢాంధకారాన తారాకలువ
బంధువు జాతిపిత బాపూజీ తానొక్కడే, కుయ్యోమొర్రో!

96. మహాత్మాగాంధీ నుంచి నేడు
రాహుల్ గాంధి వరకు కదిలినది కాలరథము
మహామహులెందరో గతించిరి
మహర్దశ వేపు నడుచునా దేశమింకెపుడు కుయ్యోమొర్రో!

97. అన్నాదురై, యంజిఆర్ తంబిలు
అన్న యన్‌టిరామారావు ఆత్మగౌరవ ప్రభంజనాలు
కన్నడ రాజకుమారుడు
అన్నవ్రు భాషోద్యమాలు దక్షిణ దిక్కునేలె కుయ్యోమొర్రో!

98. మమతా, జయలలిత అ
హమదు పటేలు, సింథియా, లాలూప్రసాదు, నితిష్
కుమారు, చంద్రబాబు, ములా
యముసింగు, ఊమన్‌చాందీ, ఒమరబ్దుల్లా లీలలీనాడు కుయ్యోమొర్రో!

99. కన్యాకుమారి నుంచి కాశ్మీరు
అన్యాక్రాంతమై ప్రైవేటు వ్యక్తుల ప్రాపర్టీలు కాగా
అన్యాయపు గాలి దోపిడీల
వన్యభూములు, ప్రాణులాక్రందిస్తున్నవి కుయ్యోమొర్రో!

100. కలికాల మాకలి కాలము
కలికానికైన కారుణ్యము లేని లోకము
కలి పురుష ప్రభావాన
కలిమిని, చెలిమిని మాపి కార్చిచ్చగును కుయ్యోమొర్రో!

గాంధీ మార్గము విడిచిన
గాంధారీ పుత్రులీ గర్వాంధులు నశించగా, గా
ఢాంధకారాన దివ్వె ప్రజా
బంధువు అంబేద్కరు బాటలో నడవవలె కుయ్యోమొర్రో!

లోహియా, పటేలు, బోసులు
మహిలో చూపిరి సత్యధైర్య మహా సాహసముల్
అహరహరము వారి ఆశయ
వాహినిలో పయనించిన విజయమగునహో, కుయ్యోమొర్రో!

సంభవామి యుగే యుగే, అ
సంభవమేమీ కాదందరు కలిసి నడిచిన; ఆ
రంభ శూరత్వము విడిచి, సం
రంభమున సాగవలె ప్రజాసందోహము, కుయ్యోమొర్రో!

కుయ్యో మొర్రో, శతకమును
అయ్యో అని ఆపక ఆమూలాగ్రం చదివినవారికి
అయ్యో! దేవయ్యో! వినవయ్యో!
ఇయ్యవలె కోరిన వియ్యములు, నెయ్యములు, కుయ్యోమొర్రో!

వందన మాంధ్రజ్యోతికి
వందనాలు బంధుమిత్ర బృందకోటికిన్
వందనము కె.శ్రీనివాసుకు
వంద పుల్లగంద పద్యాలు స్వదేశీ మద్యాలు కుయ్యోమొర్రో!

అమంగళమ్ ప్రతిహతమస్తు!
సుమంగళకర దృశ్య భావనా దివ్యదృష్టి ప్రాప్తిరస్తు!
సమంగా ధర్మార్థ వస్తు
క్రమంగా కామమోక్షాదులు మస్తుగా, ప్రాప్తిరస్తు! అస్తు!



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ–2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's narration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు – ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్ధానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర – ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book that has reached many places. (Sankaracharya's mystic poems explained and translated in modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam in simple, lucid English. The second revised edition with commentary is under print.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝురి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** – ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice'** – ఇంగ్లీషు అనువాదం

**బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:**

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా తెలుగులో అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బున్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

26. **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black- చీకటి) నిశీధి కథల సంపుటి.

27. **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

28. **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

29. **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

30. **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

31. **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠీ కవి ధసాల్ కవిత్వం.

32. **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

33. **డబ్బు-మని-షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

34. **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

35. **ఫాస్ట్-గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడ్డున్నది.

36. **ప్రపంచ ప్రసిద్ధ కథలు** – విశ్వవిఖ్యాత కథకుల ప్రసిద్ధ కథలు.

37. **కుయ్యోమొర్రో శతకం** (ఛందోబంధ రహితం)

## త్వరలో...

38. **మూడు ప్రాచీన గ్రీకు నాటకాలు** – ఇడిపస్ రెక్స్, ఏంటిగొని, ట్రోజన్ వుమెన్ – ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విషాదాంత నాటకాలు – తెలుగులో.

39. **కలలు-విశ్లేషణ – స్వప్నశాస్త్రం రెండవభాగం**

40. **శిలప్పదికారం** – కాలి అందియ కథ. తమిళ మహాకావ్యానికి దీటైన తెలుగు అనువాద కావ్యం.

41. **క్రీస్తు నడచిన దారి** – కరుణామయుడి పదముద్రలపై కవుల కవితాభినివేశం.

# కుయ్యో మొర్రో శతకం

## (ఛందో బంధ రహితం)





ఓపికతో ఓటరడిగె
గోపిని- 'గోడమీద పిల్లీ! చిరాయువు గదా
పాపి! టోపీలు పెట్టని ఉ
టోపియా తెస్తావా అంటే కోపిస్తావెందుకు' కుయ్యోమొర్రో!



ఓటరు తెలివైన వాడైనా
లీటరు పెట్రోలు రేటు ఏనాడైనా తగ్గిందా?
మీటరు కరెంటు ధాటికి
హీటరు పగిలి షాకు మీద షాకులేగద, కుయ్యోమొర్రో!

**డాక్టర్ లంకా శివరామప్రసాద్**

